విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

సోమవారం 08 సెప్టెంబరు 2025 8 పేజీలు

మాపై..ఎందుకీ పగ

- దివ్యాంగులకు పింఛన్ టెన్షన్
- సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియలో గందరగోళం
- అర్హులకు, అనర్హులుగా నోటీసులు జారీ
- నోటీసులు అందుకున్న వారికి అప్పీల్‌కు అవకాశం
- పర్సంటేజ్ తగ్గించిన దివ్యాంగుల పరిస్థితి అగమ్యగోచరం
- నోటీసులు దివ్యాంగులకేనా.. డాక్టర్లకు ఇవ్వరా..అంటూ ప్రశ్నలు

విశాలాంధ్ర - కనిగిరి:

దివ్యాంగుల పెన్షన్ల రీవెరిఫికేషన్‌పై తీవ్ర ఆందోళన నెలకొంది. 7.38 లక్షల మంది దివ్యాంగులు రాష్ట్రంలో పెన్షన్లు పొందుతున్నారు. ఐదు లక్షల మంది పెన్షన్లను రీవిరిఫికేషన్ చేయగా 1.38 లక్షల మందిని అనర్హులుగా గుర్తించి వారికి ప్రభుత్వం నోటీసులు అందించింది. అయితే అర్హులకు నోటీసులు అందించారని దివ్యాంగుల సంఘాలు, దివ్యాంగులు ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలు చేపట్టారు. గత ప్రభుత్వంలో దొంగ సదరం సర్టిఫికెట్లు పొంది అనర్హులు దివ్యాంగుల పెన్షన్లు పొందుతున్నారని ప్రభుత్వం ఆరోపించింది. అయితే గత ప్రభుత్వంలో పొరపాట్లు జరిగితే 2009 లో సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ పొందుతున్న దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను రివెరిఫికేషన్ పేరుతో వారి పర్సంటేజ్లను తగ్గించి వారికి కూడా అనర్హులనే నోటీసులు అందించారని ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. దీనితో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులు ఆందోళనలు చేపట్టడంతో దివ్యాంగులకు అందించిన నోటీసులు నిలిపివేసి ఎవరైతే నోటీసులు అందుకున్న వారిలో అర్హులు ఉన్నారో వారిని తిరిగి గ్రామాలలో ఉండే వారైతే ఎంపీడీవో, పట్టణాలలో ఉండేవారైతే మున్సిపల్ కార్యాలయలలో ఆపిల్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. జనవరి నెల నుంచి సుమారు 8 నెలల పాటు జరిగిన ఈ రివెరిఫికేషన్ ప్రక్రియలో ఇంత గందరగోళానికి దారి తీసిన పరిణామాలు ఏంటి? గత ప్రభుత్వంలో మిగతా 2 లో ...

రేపు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై

అన్నదాత పోరు

- రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వం
- యూరియాను వెంటనే పంపిణీ చేయాలి
- బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలి
- మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైయస్సార్‌సీపీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే,శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ కొన రఘుపతి అన్నారు.యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలిని బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసు కోవాలన్నారు. ఆదివారం వైసీపీ పార్టీ కార్యాలయంలో మిగతా 2 లో ...

తక్కువ ధరకు బంగారం పేరుతో
మోసం చేసిన నిందితుల అరెస్టు
4 లో..

ట్రంప్ పెత్తనాన్ని

ఎదుర్కొందాం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : అమెరికా అత్యంత దుర్మార్గంగా ప్రపంచ దేశాలపై ట్రంప్ పెత్తనాన్ని ఐక్యంగా ఎదుర్కొందామని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు.ట్రంప్ ఆర్థిక సుంకాలను వ్యతిరేకించండి భారతీయ పరిశ్రమలను కాపాడాలి అనే నినాదంతో పట్టణంలో పాత బస్టాండ్ వద్ద వామపక్షాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సింగరకొండ మాట్లాడుతూ అమెరికా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నామని 50 శాతం సుంకాన్ని పెంచింది దీంతో ఆక్వా, వస్త్ర,ఫార్మా రంగాలు తీవ్ర నష్టాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వ్యతిరేక విధానాలకు మోడీ మారు మాట్లాడే పరిస్థితి లేదన్నారు. దీంతో దేశ ఆర్థిక పరిస్థితిని పరోక్షంగా మోడీ దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిలబడి దేశంలో పరిశ్రమలు కాపాడుకోవడానికి ప్రజలు మిగతా 2 లో ...

అధ్వానంగా వితలాపురం-
రమణాలవారిపాలెం రోడ్డు
6 లో..

బొమ్మలాపురం గండి చెరువుకు లీకులు

ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర-మార్కాపురం :

నీరు ప్రకృతి ప్రసాదితం - ఆ నీరే ప్రాణాధారం. సర్వప్రాణి కోటికి అదే జీవనాధారం. నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతానికైనా, లేని ప్రాంతానికైనా మానవ మనుగడకు అది అత్యంత అవసరమైనది. క్షామ పీడిత ప్రాంతాలకు చుక్కనీరు కూడా అమృతప్రాయం. అయితే నిర్లక్ష్యం మాటున జీవనాధారమైన నీటి వృథా - రోజులు, వారాలు నెలలుతరబడి నిరంతరంగా కొనసాగుతుంది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సాగునీటి వినియోగదారుల సంఘాలు చివరకు జలవనరుల శాఖా అధికారులకూ ఈ విషయం తెలియనిదికాదు. కారణమేదైనా సదాశయంతో నిర్మితమైన ఓ నీటి రిజర్వాయర్‌లో నీరు మాత్రం అడుగంటుతుంది. అంతులేని అలవిమాలిన నిర్లక్ష్యం మాత్రం పెరిగి పోతుంది. అదే ఇప్పుడు అన్నదాతల ఆవేదన. ఆందోళన, భయాందోళనలకు కారణభూతమవుతుంది. పెద్దదోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామం వద్ద ఊరకొండ-యర్రకొండల మధ్య సహజసిద్ధంగా ఏర్పడిన గండిచెరువు రిజర్వాయర్ ఇందుకు సాక్షీ భూతంగా నిలుస్తుంది.

పశ్చిమ ప్రకాశం పరిధిలోని మార్కాపురం జలవనరుల శాఖా కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం పరిధిలో 136 చెరువులున్నాయి. ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద మధ్య తరహా జలాశయమైన కంభం చెరువు తర్వాత అంతటి ప్రాధాన్యత గల ఏకైక రిజర్వాయర్ పెద్దబొమ్మలాపురం గండిచెరువు రిజర్వాయరు. గతనెల 26,27 తేదీలలో నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ రిజర్వాయర్ 48 గంటల్లో నిండి అలుగు పారింది. ఈ రిజర్వాయరు పరిధిలోని పెద్దబొమ్మలాపురం, తమ్మడపల్లె, గుర్రపుసాల, జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు రైతాంగంలో ఆశలు చిగురించాయి. సుమారు నాలుగేళ్లపాటు వ్యవసాయసాగుకు ఢోకా ఉండబోదని రైతన్నలు ఎంతో సంబరపడ్డారు. ఇది ఎంతో సమయం నిలువలేదు. చెరువును కలియజూచిన తర్వాత మూడు బొరియలు - ఆరు లీకులు అన్న చందాన పెద్ద ఎత్తున నీరు వృధాగా పోతున్న తీరు ఆందోళన, ఆవేదన, భయాందోళనలు కల్గిస్తున్నాయి. ఊరకొండకు ఆనుకుని ఉన్న బచ్చులకురవబోడు (చెరువుకట్ట దక్షిణ భాగాన) వద్ద ఉన్న సిమెంటు - కాంక్రీటు లైనింగ్ శిథిలావస్థకు చేరి అడుగులదూరంలో రంధ్రాలు ఏర్పడ్డాయి. వాటి గుండా చెరువులోని నీరంతా కట్ట అడుగు భాగం నుండి వాగుగా ప్రవహిస్తుంది. ఇది పదుల సంఖ్యలో మోటార్ల ద్వారా వచ్చే నీటి మిగతా 2 లో ...

విశాలాంధ్ర epaper.visalaandhra.com సోమవారం 08 । సెప్టెంబరు । 2025

నేడు మండల కేంద్రాల వద్ద ధర్నా

– సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర – బాపట్ల : రైతులకు సక్రమంగా ఎరువులు సరఫరా చేసి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కోరుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్ర ంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం పండించిన పంటలకు ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేయటం సరికాదన్నారు. యూరియా, ఎరువులు కోసం రైతులు పడుగాపులు కాస్తున్నారన్నారు.బ్లాక్ మార్కెటింగ్‌లో అధిక ధరలకు యూరియా విక్రయాలు జరుగుతున్న ప్రభుత్వ యంత్రాంగం నిద్రపోతుందన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా మండల కేంద్రాల్లో ధర్నాను చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు.

గృహరుణ అవగాహన సదస్సు

విశాలాంధ్ర–ఒంగోలు : భారతీయ స్టేట్ బ్యాంక్ ఒంగోలు బిజినెస్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు రంగారాయుడు చెరువు మీద గల వాకింగ్ ట్రాక్ మీద వాకింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరికి స్టేట్ బ్యాంకు వారు అందిస్తున్న గృహ రుణాలు మరియు బిజినెస్ లోన్స్ మరియు పర్సనల్ నుంచి మరియు గోల్డ్ లోన్స్ గురించి వివరించడం జరిగింది. రీజనల్ మేనేజర్ పి శ్రీనివాసరావు గృహ రుణాలు అందిస్తున్న వడ్డీ రేట్లు వివరించారు.

గండి చెరువుకు లీకులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవాహాన్ని తలపిస్తుంది. గతంలో స్వల్పంగా ఉండి నిర్లక్ష్యానికి గురైంది. చెరువు నిండి అలుగు పారుతున్నందున నీటి ఉధృతి అధికమవడంతో ఈ లీకేజీలతో జవుకెత్తింది. ఈ లీకేజీలను జవుకును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టకపోతే చెరువుకట్ట ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. చెరువు లోపలవైపు ఉన్న రివిటింగ, కాంక్రీటు లైనింగ్ పొడవున అడుగుల మేర బొరియలు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. పెద్ద పెద్ద నెర్రెల సందుల నుండి నీరు చొచ్చుకుని వస్తుంది. ఇదేతీరు కొనసాగినట్లయితే ఇక్కడి కట్ట భాగంలో ఏ క్షణంలోనైనా గండిపడే ప్రమాదం పొంచివుంది. ఇదే పరిస్థితి తూము వద్ద కూడా ఏర్పడింది. షట్టరు వేసినా నీరు కాలువకట్ట ప్రవహిస్తుంది.

ఇప్పటికైనా నీటి పారుదల శాఖ యంత్రాంగం తక్షణమే స్పందించి గండిచెరువు రిజర్వాయరును సందర్శించి పరిస్థితిని అధ్యయనం చేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల చేపట్టాలని రైతాంగమంతా పెద్ద ఎత్తున మొరపెట్టుకుంది.

చెరువు శంకుస్థాపన :

1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భారీ నీటి పారుదల శాఖా మాత్యులు శీలం సిద్ధారెడ్డి, మధ్య తరహా నీటి శాఖా మాత్యులు యడ్లపాటి వెంకట్రావు, చిన్నతరహా నీటిపారుదల శాఖా మాత్యులు కందుల ఓబులరెడ్డి పెద్దబొమ్మలాపురం గండిచెరువు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రూ.60 లక్షలతో నిర్మాణం :

సుమారు 2500 ఎకరాల విస్తీర్ణంలో గండిచెరువు రిజర్వాయరు నిర్మాణ వ్యయం 60 లక్షల రూపాయలు. ఇందులో సుమారు వంద అడుగుల ఎత్తు మీటర్ల పొడవు చెరువుకట్ట రెండు కొండల మధ్య నిర్మించబడింది. ఒక వంద అడుగుల అలుగు కాంక్రీటు పనులు ఇందులో 20 లక్షల వ్యయంతో తమ్మడపల్లి – గుర్రపుసాల, జమ్మిదోర్నాల, చిన్నగుడిపాడు, బొమ్మలాపురం వెన్నా పాపిరెడ్డి చెరువుకు సంబంధించి మూడు సప్లై చానెళ్లతో ఆయా గ్రామాలకు 4500 ఎకరాల ఆయకట్టు.

నీటివనరులు :

నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం వెళ్లే మార్గంలోని చిన్నారుట్ల నుండి ప్రవహించే వర్షపునీరు, ఆంజనేయస్వామి దేవాలయం ప్రక్కగా చింతల–మర్రిపాలెం గిరిజన గూడేల మధ్య ఉన్న పుల్లమ్మబావి వద్ద కలిసేరాళ్లవాగు గుండా పెద్ద ఎత్తున వర్షపునీరు ఈ రిజర్వాయర్‌కు చేరుతుంది. దీనికి సమాంతరంగా ఆత్మకూరు మార్గంలో ఉన్న రోళ్లపెంట – పెద్ద చామ దట్టమైన అడవీ ప్రాంతం గుండా వచ్చే మరొక వాగు కూడా ఇందులో కలుస్తుంది.

రిజర్వాయరు నీటి సామర్థ్యం :

గరిష్ఠ వరద ప్రవాహము సుమారు 22,200 క్యూసెక్కుల వరకు ఉంటుంది.

ట్రంప్ పెత్తనాన్ని ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాతంత్ర వాదులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయంగా చూస్తే ట్రంప్ విధానాలతో ఆక్వా పరిశ్రమ కుదేలవుతోందన్నారు. వస్త్ర పరిశ్రమ నష్టాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అవసరమైన భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలను కల్పించి పరిశ్రమలను కాపాడుకోవాలన్నారు. ప్రధానంగా వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి జీవించే లక్షలాదిమంది ప్రజలకు ఉపాధి దెబ్బతినే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఇతర భారతీయ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు ప్రజలకు కలిసికట్టుగా వామపక్షాలతో కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య,న్యూ డెమోక్రసీ ఎమ్ ఎల్ నాయకులు మేకల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోనేపూడి రవి,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మామిడిపత్తుల అశోక్,ఆట్ల పోలి రెడ్డి,సిపిఐ బాపట్ల జిల్లా సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు, కొండయ్య, శరత్, కోటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకుడు బుచ్చిరాజు,వైయస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు

(మొదటిపేజీ తరువాయి)

మండల, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్న ఈ కూటమి ప్రభుత్వం చరిత్రలో లేదన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని కంటికి రెప్పలా కాపాడమన్నారు. నాణ్యమైన విత్తనాలు మొదలు రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ తదితర పథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి కృషి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల పరిస్థితి అతిదయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికి ఖరీఫ్,రబీ, రెండు సిజన్ అయి పోయిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి రైతులకు కనీసం రైతు భరోసా కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.సకాలంలో వేయాల్సిన యూరియా కూడా బ్లాక్ మార్కెట్‌కి తరలి రైతుల నెత్తిన పెనుభారంగా మారిందన్నారు.వచ్చిన యూరియా కూటమి నాయకుల ఇళ్లకు వెళ్ళుతుంది తప్ప సన్నా,చిన్నకారు రైతులకు ఒక బస్తా కూడా దొరకటం లేదన్నారు.యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదోవలో అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఉచిత పంట భీమాను పునరుద్ధరించి అందరికీ వర్తించేలా చూడాలన్నారు.పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. రైతులకి ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన రెవెన్యూ డివిజనల్ కేంద్రం వద్ద రాష్ట్ర పార్టీ నాయకుల ఆదేశానుసారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గము నుంచి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం అన్నదాత పోరు పోస్టర్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్,చేజర్ల నారాయణ రెడ్డి, జోగి రాజా,నాయుడు జల రామిరెడ్డి,చెల్లా రామయ్య, మండే విజయ్ కుమార్, వడ్డీముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చేంచయ్య, బొలిమేర అనిల్ కుమార్, కటికల యెహోషువ, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, సీకే నాయుడు, ఇనగలూరి మాల్యాద్రి, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

మాపై ఎందుకీ పగ

(మొదటిపేజీ తరువాయి)

అనర్హులు పెన్షన్ పొందుతున్నారని ఆరోపించిన ప్రభుత్వం 2009 నుంచి పెన్షన్ పొందుతున్న వారిని రీ అసెస్మెంట్ కు ఎందుకు పిలిచారు? పుట్టుకతోనే దివ్యాంగత్వంతో పుట్టిన దివ్యాంగులకు గతంలో కన్నా సదరం సర్టిఫికెట్ లో పర్సంటేజ్‌లను డాక్టర్లు ఎందుకు తగ్గించారు? అర్హులను అనర్హులుగా అనర్హులను అర్హులుగా గుర్తించడం డాక్టర్ల వైఫల్యమా? లేక ప్రభుత్వమే డాక్టర్ల చేత ఈ విధంగా పర్సంటేజ్ లను తగ్గించి వేయమని సూచించిందా? ఒక్కసారి సదరం సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాత రీ అసెస్మెంట్ నాట్ రికమండేడ్ అని మెడికల్ బోర్డు సర్టిఫికెట్ అందించిన తర్వాత తిరిగి రీవెరిఫికేషన్ కు మెడికల్ బోర్డు ఎలా అనుమతించింది? సదరం రీవెరిఫికేషన్లో ఇంతటి గందరగోళానికి కారణం డాక్టర్ల నిర్లక్ష్యమేనా? నోటీసులు అందుకున్న వారికి అపిల్కు అవకాశం, పర్సంటేజ్లు తగ్గించిన వారి పరిస్థితి ఏంటి? దొంగ సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ పొందుతున్నారని దివ్యాంగులకు నోటీసులు ఇచ్చిన ప్రభుత్వం దొంగ సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదు? దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తామంటున్న ప్రభుత్వం గతంలో దొంగ సర్టిఫికెట్లు మంజూరు చేసిన డాక్టర్లని అలాగే రీవెరిఫికేషన్లో అర్హులను అనర్హులుగా గుర్తించిన డాక్టర్లను ఐపిసి 420, 467, 468, 471, 201, 218 సెక్షన్ల ప్రకారం శిక్షిస్తుందా? డాక్టర్ల నివేదికల ప్రకారం దొంగ సదరం సర్టిఫికెట్లను జారీ చేసిన మెడికల్ బోర్డు సభ్యుల పరిస్థితి ఏంటి? వీటన్నిటికీ ప్రభుత్వంతోపాటు ప్రభుత్వ అధికారులు సమాధానం చెప్పాలని దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగుల హక్కులనేవి భారత రాజ్యాంగంతో పాటు ఆర్పిడబ్ల్యుడి చట్టం 2016 (ద రైట్స్ ఆఫ్ పర్సన్ విత్ డిజాబిలిటీ యాక్ట్ 2016) దివ్యాంగులకు రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం దివ్యాంగుల అనుమతి లేకుండా, వారికి నోటీసులు ఇవ్వడం లేదా ఇతర అసమాన, అన్యాయమైన వ్యవహారాలను తప్పనిసరి చేయడం అనేది దివ్యాంగుల హక్కులను ఉల్లంఘించడం అవుతుంది. అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను కూడా ఉల్లంఘించినట్టే అవుతుందని రాష్ట్రంలోని దివ్యాంగుల హక్కుల వేదిక, అలాగే దివ్యంగా సంక్షేమ సంఘాలు తెలియజేస్తున్నాయి. దొంగ సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ పొందుతున్నారని దివ్యాంగులకు నోటీసులు అందించిన ప్రభుత్వం సదరం దొంగ సర్టిఫికెట్లను మంజూరు చేసిన డాక్టర్లకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని దివ్యాంగుల సంక్షేమ సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. అభాగ్యులైన దివ్యాంగులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అనర్హుల పేరుతో దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేయటం, రివెరిఫికేషన్ సమయంలో దివ్యాంగులకు కనీస వసతులు కూడా కల్పించకుండా ప్రభుత్వం, అధికారులు వ్యవహరించిన తీరు ఆర్పిడబ్ల్యు చట్టాన్ని ఉల్లంఘించడమే.

సదరం సర్టిఫికెట్లలో పర్సంటేజ్ లను తగ్గించడం వల్ల దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్లాగ్ ఉద్యోగాలలో రిజర్వేషన్తో పాటు సంక్షేమ పథకాలలో రాయితీలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రివెరిఫికేషన్ పేరిట దివ్యాంగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విడనాడాలని, సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియను రద్దుచేసి గతంలో మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లను పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు అలాగే దివ్యాంగ సంక్షేమ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. లేనిపక్షంలో రాబోయే అసెంబ్లీ సమావేశాలలో అసెంబ్లీని ముట్టడిస్తామని అవసరమైతే ఆర్టికల్ 226, ఆర్టికల్ 32 ప్రకారం దివ్యాంగుల హక్కులకు భంగం కల్పించే విధానంపై కోర్టుకు వెళ్తామని స్పష్టం చేస్తున్నారు.

రీవెరిఫికేషన్లో 80 శాతం పర్సంటేజ్

– దోసపాటి నరసయ్య

నా పేరు దోసపాటి నరసయ్య నేను కనిగిరిలోని సాయి కృష్ణ దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకుడను నేను పుట్టుకతోనే దివంగత్వంతో పుట్టాను గతంలో నాకు సదరం సర్టిఫికెట్‌లో 90 శాతం పర్సంటేజ్ ఇస్తే, సదరం రీవెరిఫికేషన్లో 80 శాతం పర్సంటేజ్ ఇచ్చారు. పుట్టుకతో దివ్యాంగుడనైనా నాకు పర్సంటేజ్ ఎందుకు తగ్గింది నేను పుట్టినప్పుడు ఎలా ఉన్నానో ఇప్పుడు అలానే ఉన్నాను మరి పర్సంటేజ్ ఎందుకు తగ్గింది నాకే కాదు మా ఆశ్రమంలో ఉన్న చాలామంది దివ్యాంగులకు పర్సంటేజ్లు తగ్గించి అర్హులైన దివ్యాంగులకు నోటీసులు కూడా ఇచ్చారు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలలో రాయితీలను కోల్పోవడంతో పాటు ఉద్యోగాలు అవకాశాల్లో రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుంది దయచేసి ప్రభుత్వం సదరం రివెరిఫికేషన్ ప్రక్రియను రద్దుచేసి గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లనే కొనసాగించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున ప్రభుత్వాన్ని కోరుతున్నాం లేదంటే ఆర్పిడబ్ల్యుడి యాక్ట్ 2016 ప్రకారం న్యాయమైన మా హక్కుల కొరకు కోర్టుని ఆశ్రయిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. సాయి కృష్ణ దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు దోసపాటి నరసయ్య.

నోటీసులు ఇవ్వడం చాలా దారుణం

దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు

గత ప్రభుత్వంలో అనర్హులు దొంగ సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ పొందుతున్నారని ఆరోపించిన ప్రభుత్వం సదరం రీవెరిఫికేషన్లో 2009 నుంచి సదరం సర్టిఫికెట్లు పొంది పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులను రీవెరిఫికేషన్‌కు ఎందుకు పిలిచారు. వారి సదరం సర్టిఫికెట్లలో పర్సంటేజ్లను తగ్గించడంతోపాటు కొందరిని అనర్హులుగా గుర్తించి నోటీసులు ఇవ్వడం చాలా దారుణం దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లలో రీవెరిఫికేషన్ పేరా పర్సంటేజ్లు తగ్గించి ఇవ్వడం వల్ల దివ్యాంగులు బ్యాక్లాగ్ ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ శాతాన్ని కోల్పోవాల్సి వస్తుంది దీనితోపాటు ప్రభుత్వం అందించే రాయితీలకు, సంక్షేమ పథకాలకు అనర్హులుగా ఎంచబడతారు. ప్రభుత్వం వెంటనే సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియను నిలుపుదల చేసి గతంలో మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లను కొనసాగించాలి లేనిపక్షంలో రాబోయే అసెంబ్లీ సమావేశాల సమయంలో దివ్యాంగుల హక్కుల వేదిక సమక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తాం అవసరమైతే చట్టపరమైన న్యాయం కోసం కోర్టుకు వెళ్తాం.

ఉచిత వైద్య శిబిరాలు..అభినందనీయం

క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరు నాగేశ్వరరావు

విశాలాంధ్ర-ఒంగోలు : పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ చాపల వంశీకృష్ణ సేవలు అభినందనీయమని క్విస్ కాలేజ్ చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు తెలియజేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ పార్క్ ఆవరణలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రముఖ ఎముకలు మరియు కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈరోజు చెన్నకేశవ స్వామి లేఅవుట్,ఎన్టీఆర్ పార్క్ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా జరిగిన ఈ వైద్య శిబిరంలో సుమారు 287 మందికి ఉచితంగా బిపి ,షుగర్, ఈసీజీ, ఎముకల పట్టుత్వ పరీక్ష మరియు పల్సాక్షి మీటర్ పరీక్షలు , పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా నిర్వహించారు ప్రముఖ ఎముకలు ,కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ చే మోకాళ్ళ నొప్పులు ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయవలసిన వ్యాయామాల గురించి వైద్య సలహాలు, సూచనలు అందజేయడం జరిగింది. సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ పది వేల అడుగులు నడవాలని సూచించారు.ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయడం వలన శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యకరంగా ఉండవచ్చని,వ్యాయామం ఎక్కువగా కండరాలను, రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగు పరచడానికి, అధిక బరువు తగ్గించుకోవడానికి, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అలాగే క్రమం తప్పకుండా చేసే వ్యాయామం వలన మన శరీరపు వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందని, గుండెకు సంబంధించిన వ్యాధులు, స్థూలకాయం, మధుమేహం వంటి వ్యాధులు రాకుండా నిరోధిస్తుందని తెలియజేశారు.ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందిన వారికి శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు నెలరోజులపాటు ఉచిత ఓపి మరియు పరీక్షల నందు రాయితీ తో కూడిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలియజేశారు.చిన్న పిల్లల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కారణంగా సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఉచిత ఓపి, పరీక్షల మీద రాయితీతో డాక్టర్ నరహరి వెంకట సుస్మిత, వీణ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రతినెల మొదటి గురువారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అన్ని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు ఉచితంగా ఓపి, బిపి షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష ,ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్ష, యూరిక్ ఆసిడ్ ,పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా చేయబడును అని తెలియజేశారు.ప్రకాశం జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ఎన్టీఆర్ పార్క్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావుకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్ పాల్గొన్నారు.

మూతబడిన...ఏటీఎంలు

విశాలాంధ్ర -కంభం : కందులాపురంసెంటర్‌లో ఉన్న కెనరా బ్యాంకు, ఎస్బిఐ ఏటీఎంలు గత ఎనిమిది నెలలుగా పనిచేయక పోవటంతో ఖాతాదారులు డబ్బులకోసం నానా అవస్థలు పడుతున్నారు. బెస్తవారిపేట ,కంభం మండలాలకు కెనరా బ్యాంకు ఏటీఎం ఒక్కటే కావటంతో కొత్తగా వచ్చిన ఏటీఎం కార్డులు పిన్ జనరేట్ చేసుకోవాలంటే ఉన్న ఒక్క ఏటీఎం పనిచేయక వెనుతిరిగి పోతున్నారు. అదేవిధంగా కందులాపురం సెంటర్‌లో పలు శాఖల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. పింఛనుదారులు, నెల జీతాలు తీసుకునే ఉద్యోగులు చాలామంది ఉన్నారు.వృద్ధులకు అనుకూలంగా ఉన్న ఈ ఏటీఎంలు పనిచేయక పోవటంతో ఆయనసంబంధిత బ్యాంకులకు వెళ్ళవలసి వస్తుందని వాపోతున్నారు. బ్యాంకు ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కెనరాబ్యాంక్,ఎస్బిఐ బ్యాంకు మేనేజర్‌లు ఏటీఎం లు పనిచేసే విధం గా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలోని పెదగార్లపాడులో ఇటీవల జరిగిన మహిళ పోలమ్మ హత్య కేసులో నిందితుడు లక్ష్మయ్యను అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అక్కను తన తమ్ముడు హత్య చేసినట్లు తెలిపారు. దాంతో నిందితుడిని గురజాల కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ భాస్కర్, ఎస్సైలు పాపారావు, సౌందర్ రాజన్ ఉన్నారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రజలు ఎవరైనా ఊర్లకు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని దాచేపల్లి సీఐ భాస్కర్ కోరారు. లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్) ద్వారా ప్రజలు ఇళ్ళలో లేని సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే వారి ఆస్తులకు పూర్తి రక్షణగా ఈ సిస్టం ఉపయోగ పడుతుందన్నారు. కావున ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

ఎన్క్యూఏఎస్ కార్యక్రమం తనిఖీ

విశాలాంధ్ర-గురజాల : నగర పంచాయతీ గురజాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో జరగనున్న ఎన్క్యూఏఎస్ కార్యక్రమం నేపథ్యంలో డీసీహెచ్ ఎస్.ప్రసూన ఆదివారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్క్యూఏఎస్ అనగా జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు అని ఇది ఆసుపత్రిలో ప్రజారోగ్య సౌకర్యాల సంరక్షణ నాణ్యతను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం అని అన్నారు. ఈ ప్రమాణాలు ఆసుపత్రి సౌకర్యాలు, రోగి హక్కులు, క్లినికల్ కేర్, ఇన్ఫెక్షన్ నియంత్రణ, నాణ్యత నిర్వహణ వంటి అనేక రంగాలపై దృష్టి పెడుతుందని అన్నారు. ముందుగా ఆమె ఆసుపత్రి ప్రాంగణం మొత్తం పరిశీలించి రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిశీలించిన అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సుధీర్, డాక్టర్ సురేష్, హెడ్ స్టాఫ్ జయ, వెంకయ్య, శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఇంటర్నేషన్ వేడుకల్లో 'శిద్దా'

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు పి.ఏ.జి.కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 8వ క్యాబినెట్ ఇన్స్టాలేషన్ వేడుకలలో అతిధిగా ఎమ్.జె.ఎఫ్ లయన్, మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ సి.హెచ్ హరి ప్రసాద రావు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్,ఇన్స్టాలేషన్ ఆఫీసర్ లయన్ పర్వతనేని సుభాష్ బాబు,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిపూడి లక్ష్మి నారాయణ,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ సోమేపల్లి వెంకటేశ్వర్లు, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జిల్లా లయన్స్ క్లబ్ ప్రతినిధులు శిద్దా రాఘవరావుని శాలువాతో సత్కరించారు.

9న అన్నదాత పోరును విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కొమరోలు : ఈ నెల 9వతేది మార్కాపురం లో వైసీపీ ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరును విజయవంతం చేయాలని కొమరోలు జడ్పిటిసి సారె వెంకట్ నాయుడు రైతులకు పిలుపునిచ్చారు. కొమరోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం అన్నదాత పోరు పోస్టర్లను వైసిపి సీనియర్ నాయకులు నాదేళ్ల వెంగయ్య చౌదరితో కలిసి ఆవిష్కరించారు. జెడ్పిటిసి వెంకట నాయుడు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో రైతులు, వైసిపి శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టి సబ్ కలెక్టర్ కు రైతుల సమస్యలపై వినతిపత్రాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు, వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు వెంగయ్య చౌదరి, మండల కన్వీనర్ మేరిగ రవి కుమార్, కొమరోలు వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపిటిసిలు షేక్ సుభాని, తిరుపతి రాజు, వైసిపి నాయకులు బంగారు విశ్వరూపం, గోల్కొండ అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-తాడే పల్లి : ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు అమ్మిశెట్టి రామారావు జ్ఞాపకార్థం అమరావతి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వేణు నాదెళ్ల, సౌజన్య కేతినేని ఆధ్వర్యంలో ఆదివారం కుంచనపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది.

అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ నాయుడు కుమార్తె వేదస్నీ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులు శ్రీ నారాయణ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు మంకాల ప్రసాద్ శర్మ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సిఎస్పురం ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు, గ్రామస్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామస్తులు, అభిమానులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మన్నేపల్లి సురేష్, రేనాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం వైఫల్యం



విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులను దిక్కుతోచని స్థితిలో కూటమి ప్రభుత్వం నెట్టివేసిందని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా సరఫరా లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇలాంటి దౌర్భాగ పరిస్థితి రాష్ట్రంలోని రైతులకు ఎన్నడూ లేదని, రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏర్పడిన యూరియా కొరతకు కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.వరి నాట్లు సమీపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని,తెల్లవారుజాము నుంచే ఎరువుల కేంద్రాల దగ్గర కిలోమీటర్ క్యూలు ఉంటున్నాయని, ఒక్క బస్తా యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూపులు చూడవలసి వస్తుందని, ఎన్నికల ముందు రైతు పక్షపాతులుగా ప్రకటించుకున్న కూటమి ప్రభుత్వంలోని పార్టీలు తీరా అధికారంలోకి వచ్చాక రైతులపై చూపించే చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాగుకు పెద్దపీట వేస్తామని ప్రగల్బాలు పలికి తీరా అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర కోటా మేరకు యూరియా వస్తే మరి ఆ ఎరువులు ఏమయినాయని,రైతులకు చేరాల్సిన యూరియా దారి మళ్లి దళారుల చేతికి వెళ్తుంటే ప్రభుత్వం కళ్ళకు గంతలు కట్టుకున్నట్టు ప్రవర్తిస్తుందని, యూరియా అక్రమ రవాణాపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ నిద్ర నటిస్తున్నాయని,266 రూపాయలు అమ్మాల్సిన బస్తా ధర బహిరంగ మార్కెట్ లో 500 రూపాయలకు ఎందుకు అమ్ముతున్నారో తెలియజేయాలని,ఇది నిజంగా కొరతన లేక అధికార పార్టీ సృష్టిస్తున్న కృత్రిమ కొరతన అనేది రైతుల అనుమానాలు ఉన్నాయని, ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులకు అవసరమైన యూరియాను, డి ఏ పి, కాంప్లెక్స్ ఎరువులను వెంటనే సొసైటీల ద్వారా కానీ, ఆర్.బి కేల ద్వారా కానీ సరఫరా చేయాలని, రాష్ట్ర రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలి గౌస్ డిమాండ్ చేశారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

- జడ్పీటీసీ వెంకట నాయుడు

విశాలాంధ్ర-కొమరోలు : అన్నదాత పోరును విజయవంతం చేయాలని కొమరోలు జడ్పీటీసీ సారె వెంకట్ నాయుడు రైతులకు పిలుపునిచ్చారు. కొమరోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి వెంకట నాయుడు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో రైతులు, వైసిపి శ్రేణులు నిరసన చేపట్టి సబ్ కలెక్టర్ కు రైతుల సమస్యలపై వినతిపత్రాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమాన్ని రైతులు, వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మేరిగ రవి కుమార్, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపిటిసిలు షేక్ సుభాని, తిరుపతి రాజు, వైసిపి నాయకులు విశ్వరూపం, గోల్కొండ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుకు సత్కారం

విశాలాంధ్ర-తుళ్లూరు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఉద్యమ కెరటం, అక్షర దీపం, స్నేహశీలి, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి, మండలంలోని నెక్కల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సిహెచ్ ఆదినారాయణను ఎంపిక చేయడం సంతోషదాయకమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆదినారాయణకు యూటీఎఫ్ మండల శాఖ శుభాకాంక్షలు తెలిపింది. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, గౌరవాధ్యక్షులు ఎ.కోటేశ్వరరావు, టి.ఉమ మహేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎ.కళ్యాణ్, టి.పూర్ణచంద్రరావు, ఎం.ఈశ్వర్‌నాథ్, ఎం.ఉమామహేశ్వరరావు శాలువాలతో సత్కరించారు.

పద్మశాలి ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కార్యాలయం రామలింగేశ్వరపేటలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారికి అభినందన సత్కార కార్యక్రమము నిర్వహించారు. పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు జీవీ రామకృష్ణ, తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల సుబ్బారావు, కోశాధికారి తిరువీధుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన మాచర్ల నాగేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు కొలకలూరు, ఉపాధ్యాయులు ఆకురాతి హరివరప్రసాద్, దివి ఉమాదేవి, మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, ఆరికాటి బాలసుబ్రమణ్యంలకు అభినందన సత్కారం చేశారు. పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఎంతో నైపుణ్యంతో విద్యార్థులకు విద్యాబోధన చేయడం, సమర్థవంతంగా విధులు నిర్వహించి అధికారుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల మన్ననలు పొందడం మన పద్మశాలి సామాజిక వర్గమునకు ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించడం గర్వముగా ఉందని అన్నారు.

ఓరుగంటి పద్మకు పుత్ర వియోగం

విశాలాంధ్ర-పామూరు : పట్టణం వైసీపీ నాయకురాలు ఓరుగంటి పద్మ కుమారుడు వెంకటేష్ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వైసీపీ మహిళా జోనల్ అధ్యక్షురాలు, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆదివారం ఉదయం వెంకటేష్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. మృతుని భార్య పిల్లలు, తల్లిదండ్రులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామి రెడ్డి, వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గట్ల విజయ భాస్కర్ రెడ్డి, షేక్ చంద్ బాషా, అంబటి కొండా రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య శ్రీ రామ్ శ్రీనివాసులు, గాయకవాడ సుభాషిణి, పండిటి వెంకట లక్ష్మీ, షేక్ రసూల్, షేక్ కాలేషా, షేక్ మీరా మొహిద్దీన్ పాల్గొని వెంకటేష్ పార్థివ దేహానికి నివాళు లర్పించారు.

తక్కువ ధరకు బంగారం పేరుతో మోసం చేసిన నిందితుల అరెస్టు

- రూ.14 లక్షలు,కారు,సెల్ ఫోన్లు స్వాధీనం
- సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : కర్ణాటక రాష్ట్రానికి చెందిన బంగారపు వ్యాపారులను మోసగించి దౌర్జన్యానికి పాల్పడిన ఏడుగురు నిందితులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరగా అరెస్టు చేయడమే కాక రూ.14 లక్షలను,కారును,సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన చీరాల రూరల్ ఈపురుపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.చీరాల డీఎస్పీ మొహమ్మద్ మోయిన్ ఈపురుపాలెం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.కర్ణాటక రాష్ట్రానికి చెందిన బంగారు ఆభరణాల తయారీదారులకు తక్కువ ధరకు బంగారు ఆభరణాలు విక్రయిస్తామని బాపట్ల జిల్లా చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెం గ్రామానికి పిలిపించి,వారిని బెదిరించి రూ.14 లక్షల నగదు దోచుకుని వెళ్ళిన నిందితులను చీరాల రూరల్ పోలీసులు 24 గంటలలోపు అరెస్టు చేసినట్లు తెలిపారు.శనివారం కర్నాటక రాష్ట్రం శికారిపుర తాలూకా దొడ్డపేటకు చెందిన యువి నాగరాజుకు ముద్దాయిలు గంగావతి నివాసులు సాతుపాటి యువరాజు,బేతాడి శశికుమార్, బేతావది నాగరాజు,దొడ్డ గజ్జిలేర్ కిషోర్ కుమార్,సురతాని రవికుమార్,కవాడి హరీష్,చప్పిడి మురళీకృష్ణలు తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామని ఫోన్‌లో పరిచయం చేసుకుని,ముందు కొంత బంగారాన్ని ఆటోనగర్ దగ్గర ఇచ్చి నమ్మకం కలిగించారని తెలిపారు.శనివారం ఫిర్యాదుదారుడు, అతని సోదరుడు రూ.14 లక్షల నగదుతో కర్నాటక నుండి చీరాలకు వచ్చినట్లు తెలిపారు.వారిని చీరాల నుండి ఈపురుపాలెం గ్రామంలోని ఆటో నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న పొలం వద్దకు బంగారం తీసుకొని వేరేవాళ్ళు వస్తారు అని లోనికి తీసుకొని వెళ్లారన్నారు. అక్కడ ఏడుగురు నిందితులు ఫిర్యాదుదారుడిని,అతని సోదరుడిని కొట్టి,కత్తితో బెదిరించి, వారి వద్ద ఉన్న రూ.14 లక్షల నగదు,సెల్ ఫోన్‌లను దోచుకొని కారులో పారిపోయారన్నారు.ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న చీరాల రూరల్ ఎస్సై చంద్రశేఖర్ జిల్లా ఎస్పీ తుషార్ డూడి దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాలతో చీరాల డీఎస్పీ ఎమ్‌డి మోయిన్ పర్యవేక్షణలో చీరాల రూరల్ సిఐ పి.శేషగిరిరావు, ఎస్సై ఏ.చంద్రశేఖర్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ బాపట్ల ఐటి కోర్ బృందం అందించే సమాచారం ఆధారంగా,సీసీ కెమెరాలు,టోల్ ప్లాజాల నుండి పొందిన సమాచారం మేరకు మొత్తం 7 గురు ముద్దాయిలు కర్నాటక రిజిస్ట్రేషన్ కలిగిన కెఏ 37 ఎన్8637 అను నెంబర్ కలిగిన కారులో నరసరావుపేట మీదుగా దోర్నాల వైపు వెళుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.దోర్నాల పోలీసులను అప్రమత్తం చెయ్యడంతో వారు నిందితుల కారును అడ్డగించినట్లు తెలిపారు.ఈపురుపాలెం ఎస్సై ఏ.చంద్రశేఖర్ సిబ్బందితో ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి చోరీకి గురైన రూ.14 లక్షల నగదు,రెండు సెల్‌ఫోన్లు, కర్నాటక రిజిస్ట్రేషన్ కలిగిన కెఎ37ఎన్8637 అను నెంబర్ కలిగిన కారును ముద్దాయిల నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని 24 గంటలలోపే కేసును చేదించి ముద్దాయిలను చాకచక్యంగా అరెస్టు చేసి,నగదును రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన చీరాల డీఎస్పీ ఎమ్‌డి మోయిన్, చీరాల రూరల్ సిఐ పి.శేషగిరిరావు,ఎస్సై ఏ.చంద్రశేఖర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు.

'కొంపల్లి'కి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

విశాలాంధ్ర-ఒంగోలు : హిందీ ఉపాధ్యాయుడు కొంపల్లి వీరభద్రరావు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం తో ఘనంగా సత్కరించారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైనారు.శ్రీ హర్షిణి విద్యాసంస్థలు అధినేత గోరంట్ల రవికుమార్,వి ఎన్ జి విద్యాసంస్థల అధినేత మాధవరావు, శ్రీ గురుదత్త విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత తాళ్లూరు రమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. 50 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ హిందీ ఉపాధ్యాయుడిగా కొంపల్లి వీరభద్రరావు విశేష సేవలు అందించారు. అ ఆయన్ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఒంగోలులోని శ్రీ గాంధీ పబ్లిక్ స్కూల్లో ప్రస్తుతం ఆయన హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయనకు పరిష్కారం రావడం పట్ల గాంధీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అలాగే పలువురు ఉపాధ్యాయులు అభి నందించారు. ఒకే వేదికపై వచ్చి పురస్కారాల అందుకోవటం సంతోషకరమని అన్నారు ప్రతి ఒక్కరూ విద్యార్థులు భవిష్యత్తుకు కృషి చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ గ్రహీత, మండల ఉత్తమ గ్రహీత ఉపాధ్యాయులకు ఆదివారం మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడిటోరియం నందు ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా గొట్టిముక్కల వెంకట గోపాలయ్య, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగా ఎంపికైనందున, మరియు మండల స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు కూచిపూడి వెంకయ్య, దాసరి సుధాకర్, గూడూరి సువర్ణ, కేవీ నారాయణమ్మ, వండ్లమూడి శ్రీనివాసులు, వీరికి మండల స్థాయి ఉత్తమ అవార్డులుగా ఎంపికైనందుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సీఆర్ ఎంటి పేరు మహమ్మద్ అనీ ఫ్ లను శాలువులతో, సన్మానించారు. పలువురు మాట్లాడుతూ కృషి ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, వల్లపునేని కాశయ్య, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి ఈదర మల్లయ్య, జెడి లక్ష్మయ్య, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కే.మురళి, ప్రధానోపాధ్యాయుడు మోహన్ నాయక్, ఉపాధ్యాయులు వర్ధన్, కిషోర్ కుమార్, కాశి రాములు, కోటపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : సెప్టెంబర్ నెల 8వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్‌సైట్ నందు కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పోలేరమ్మకు పాల పొంగళ్లు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : స్థానిక డివి పాలెంలో ఆదివారం దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో పోలేరమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్ళు పెట్టి తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగి చిన్న వెంకటస్వామి, నాగి రసూల్, నాగి గౌరీ, ఎర్ర గురవయ్య, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు పోరుబాటను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర – వేమూరు : రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీన రేపల్లె రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద చేపట్టనున్న రైతు పోరుబాట కార్యక్రమంలో రైతులు వైసీపీ నాయకులు పాల్గొని విజయ వంతం చేయాలని వేమూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేమూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై మొద్దు నిద్రపోతుందని,అన్నదాతలపట్ల నిర్ల క్ష్యంతో ఉన్న ఈ ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈనెల 9న ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అంద జేస్తామని తెలిపారు.యూరియా అడి గితే రైతులను జైల్లో పెడతామంటూ ముఖ్యమంత్రి అనడం సిగ్గు చేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాల్సింది పోయి వారినే జైల్లో పెడతా మంటూ బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. యూరియా కోసం రోడ్లపై పడి గాపులు కాస్తున్న రైతులను కించ పరుస్తూ విమర్శించడం కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ పోరాటంతో ప్రభుత్వం స్పందించి రైతాంగ డిమాండ్లపై దిగిరావాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్ ను అరికట్టి ఎమ్మార్పీకే రైతులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు యూరి యాను ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల ద్వారా గాని,రైతు సేవా కేంద్రాల ద్వారా గాని అందజేయా లని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇన్పుట్ సబ్సిడీ,క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించి రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర చెల్లించా లని,యూరియాను కృత్రిమ కొరత సృష్టించి,బ్లాక్ మార్కెట్ దందాతో కొంత మంది డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ పోరాడుతుందని గుర్తు చేశారు.సమావేశంలో మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకర్ రావు,పార్టీ నాయకులు దున్న మేరేస్ బాబు, జిగిని బాబు,శ్యాం ప్రసాద్,గోపి తదితరులు ఉన్నారు.

ఏజీపీ రామకోటయ్యకు అభినందనలు

విశాలాంధ్ర – సంతమాగులూరు : పుట్టావారిపాలెం వాసి బత్తుల రామకోటయ్య అద్దంకి కోర్టు ఏజీపీగా నియమితులైన విషయం తెలిసిందే. ఈసందర్భంగా సంతమాగులూరు మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడు కొండ లు,మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, మండల టీడీపీ నేత వాసురెడ్డి ఆదివారం రామకోటయ్యను అద్దంకి లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మా నించారు. భవిష్యత్తులోనూ ఉన్నత పదవులు స్వీకరించాలని ఆకాంక్షించారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాలకి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగులు విగ్రహం స్మృతివనం, మ్యూజియానికి 6.8 ఎకరాలు భూమిని కేటా యించిన సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి,సీఎం నారా చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ ఉపాధ్యక్షుడు బుర్లె అనిల్,మందపాటి ఆంధ్రెయ, టీడీపీ నాయకులు బూర్లె రామ సుబ్బారావు,ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు కొత్తమాసు సత్యనారాయణ,ఆర్య వైశ్యులు, టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బీసీ సంక్షేమ సంఘం యువజన బాపట్ల జిల్లా అధ్యక్షులు పచ్చవట్ల గంగరాజు

విశాలాంధ్ర – నిజాంపట్నం : రైతుల శ్రేయ స్సే ధ్యేయంగా వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం యువజన బాపట్ల జిల్లా అధ్యక్షులు పచ్చవట్ల గంగరాజు అన్నారు.ఆదివారం నిజాంపట్నంలో ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత అనేది లేదని చెప్పారు.రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,టీడీపీ నేత అనగాని శివప్రసాద్,జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్యల చొరవతో మండలంలో యూరి యా కొరత ఉండకూడదనే ముఖ్య ఉద్దే శంతో నిజాంపట్నం,కూచినపూడి పీఏసీఎస్ సొసైటీలకు అలాగే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సరిపడా యూరియా సమృద్ధిగా అందు బాటులో ఉంటుందని చెప్పారు .మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయ రాజు రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వ్యవసాయపరంగా మంచి సలహా లు,సూచనలను అందిస్తున్నారని చెప్పారు. అలాగే రైతులు సజావుగా యూరియా అందించే విధంగా ఏఓ చుక్కా విజయ రాజు చర్యలు తీసు కుంటున్నారన్నారు. యూరి యా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.రైతులు తమ అవసరం మేరకు యూరియాను తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

గ్రంథాలయంలో 'చదవడం-మాకు ఇష్టం'

విశాలాంధ్ర – సంతమాగులూరు : ప్రతిఒక్క విద్యార్థి చదవడం, రాయడంపై దృష్టి సారించాలని గ్రంథపాలకుడు బాదం విజయ భాస్కర్ రెడ్డి సూచించారు. ఆది వారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.17 మంది విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం చేశారు.తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు సామాజిక, సమకాలీన అంశాలపై కూడా అవగాహన ఉండాలని చెప్పారు. తెలుగుతో పాటు ఆంగ్లం,హిందీ భాషలపై పట్టు సాధించేందుకు తర్ఫీదు,నిరంతరం సాధన చేయాలని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌కు సత్కారం

విశాలాంధ్ర – సంతమాగులూరు : ఏపీశాట్ ఎండీ గొన్నాబత్తుల శ్రీకాంత్‌ను జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి చల్లా వెంకట కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కాలంలో వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో పబ్లిక్ ట్రాన్స్ పరెన్సీ గవర్నన్స్ లీడర్ షిప్ అనే అవార్డు శ్రీకాంత్‌ను వరించింది. ప్రజల ధనాన్ని సద్వినియోగం,పాలనలో పార దర్శకత పెంచడానికి ఆయన కృషి చేశారు.గత నెల 31న ఆక్స్ ఫర్డ్ యూ నివర్సిటీలో పురస్కారం కూడా స్వీకరించారు. శ్రీకాంత్‌ను వెంకట కృష్ణారావు శాలువా,పుష్పగుచ్ఛంతో చిరుసత్కరించి అభినందనలు తెలిపారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మామిడాలకు సన్మానం

విశాలాంధ్ర – చీరాల టౌన్ : చీరాల ఎన్ఆర్పియం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్‌లో వాకింగ్ సభ్యుడు,రోటరీ క్లబ్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ,జనసేన పార్టీ నాయకుడు మామిడాల శ్రీనివాసరావు చీరాల వీరరాఘవస్వామి గుడి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారిని సత్కరించారు.మామిడాల మాట్లాడుతూ పదవి ఇచ్చినందుకు స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్యకి, పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పదవి ఇచ్చిన వారికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తానని తెలియజేశారు. పోలుదాసు రామకృష్ణ,చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణ మూర్తి,వలివేటి మురళీకృష్ణ,డి.వి.సురేష్, దండా నారాయణ రావు,అమరా వీరాంజనేయులు,చింతా రమేష్,నాగ వీరభద్రా చారి,గుద్దంటి రమేష్,కోట నారాయణ,పుల్లయ్య నాయుడు,పూర్ణచంద్ర రావు,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో అధిక దిగుబడి

విశాలాంధ్ర – చెరుకుపల్లి : సాంప్ర దాయ ఎరువులు అధికంగా వాడటం వలన భూమి కాలుష్యం,భౌతిక లక్షణాలు దెబ్బ తింటాయని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీ అన్నారు.ఆదివారం ఆమె కావూరు పిఎసిఎస్ పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ మోతాదులో అధిక ఫలితం,సాధారణ ఎరువులతో పోలిస్తే నానో ఎరువులు చాలా తక్కువ పరిమాణంలో వాడిన పంటలకు సమృద్ధిగా పోషకాలు లభిస్తాయన్నారు. మొక్కలకు త్వరగా శోషణ నానో కణాల పరిమాణం చిన్నదిగా ఉండటంతో మొక్కలు వేగంగా శోషించుకొని మంచి పెరుగుదల సాధిస్తాయన్నారు.నష్టాలు తగ్గింపు,నేలలో లీకేజీ,ఆవిరైపోవడం,వర్షంలో కొట్టుకుపోవ డం వంటి నష్టాలు తగ్గుతాయి అన్నారు. పంట దిగుబడి పెరుగుతుందని,సరైన విధంగా వాడినప్పుడు పంట నాణ్యత మెరు గవుతుందన్నారు.తక్కువ మోతాదులో ఎక్కువ ప్రయోజనం లభించడం వలన రైతు లకు ఖర్చు తగ్గుతుందన్నారు.నేల,నీరు గాలి కాలుష్యం తగ్గి పర్యావరణానికి అనుకూ లంగా ఉంటుందన్నారు.నానో యూ రియా, నానో డిఏపి లాంటి ద్రవ ఎరువులు పిచికారి చేయడం ద్వారా సులభంగా పంటలకు చేరుతాయన్నారు. మండల వ్యవసాయ అధికారి మొహమ్మద్ ఫరూక్ మాట్లాడుతూ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.యూరియా అందరికీ కావలసినంత విడతల వారీగా అందించడం జరుగుతుందన్నారు.రైతులు కావలసిన మేరకు మాత్రమే విలువలను తీసుకోవాల న్నారు. సంస్థ అధ్యక్షులు మండవ తాతాజీ, కార్యదర్శి సుఖవాసి శ్రీ రామయ్య,ఏ.ఎస్పై శ్రీనివాస రావు,ఏఈఓ రామకృష్ణ, పృథ్వి,గ్రామ వీఆర్వో,రైతులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకవర్గ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర – కారంచేడు : కారంచేడు గ్రామంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలకవర్గ కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి.ఈ ఎన్నికల్లో గత కమిటీ సభ్యులకు వ్యతిరేకంగా ఎవరు నామినేషన్ ఇవ్వకపోవడంతో ఏకగ్రీవంగా పాత కమి టీనే ఎన్నికయ్యారు.ఆలయ అధ్యక్షుడిగా అమర ఆంజనేయులు, ఉపాధ్య క్షుడిగా యేల్చూరి శ్రీనివాసరావు,కార్యదర్శిగా మువ్వల కాశీ విశ్వనాథం, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.భక్తులు,గ్రామస్థులు కొత్త పాలకవ ర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

గంగా భవానీకి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన తాళ్లూరు మండలం సోమవరప్పాడు పరిధిలోని గుంటి గంగా భవానీకి అదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిపించి చల్లగా చూడు గంగమ్మా అంటూ పూజలు ప్రత్యేక పూజలు చేసారు. చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ దర్శనం నిలిపి వేసి గుడిని మూసి వేసారు. తిరిగి సోమవారం ఉదయం ప్రత్యేక సంప్రొక్షణ అనంతరం దర్శన పూజా కార్యక్రమాలు ఉంటాయని ఈఓ వాసు బాబు తెలిపారు. ఆదివారం పూజారులు ప్రకాశ రావు , కామేశ్వర శర్మ, బాల రాజు , విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురు బ్రహ్మం , ఈఓ వాసు బాబు, ఆర్ ఏ ప్రసాదు భక్తులను కావలసిన సౌకర్యాలను పర్యవేక్షించారు.

ప్రకాశం జిల్లాలోనే తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలను కొనసాగించాలి

విశాలాంధ్ర -తాళ్లూరు: ప్రకాశం జిల్లాలోనే తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లూరు మండలంలో సంతకాల సేకరణ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల చైర్మన్ , దర్శి నియోజక వర్గ సమన్వయ కర్త కైపు వెంకట క్రిష్ణా రెడ్డి తెలిపారు. తాళ్లూరు నుండి మార్కాపురంకు 92 కి.మీల దూరం ఉండగా, ఒంగోలు కేవలం 35 కి.మీల మేర మాత్రమే ఉందని ఇటువంటి అనేక కారణాలను వివరించారు. పార్టీలకు అతీతంగా విద్య, ఉద్యోగ, కార్మిక, కర్షక సోదరులు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి:శ్యామల కాశిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా టిడిపి కార్యకర్తలు కృషి చేయాలని అందుకు ప్రతి కార్యకర్త ముందుకు రావాలని తెలిపారు ప్రభుత్వం అందించే పథకాలు ప్రజల్లోకి వెళ్లకపోతే పార్టీకి నష్టం కలుగుతుందని పథకాల ప్రచారం అన్ని గ్రామాలలో ఇంటింటికి చేరాలని కోరారు.పలువురు టిడిపి నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లాకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన బొల్లా నరసింహారావు ను ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ ఆదివారం స్థానిక మహలక్ష్మి మిల్క్ డైరీలో మర్యాదపూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహారావు ను శాలువతో సన్మానించి వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అధ్వానంగా విఠలాపురం- రమణాలవారిపాలెం రోడ్డు

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలోని విఠలాపురం - రమణాల వారి పాలెం తారు రోడ్డు తీవ్ర అధ్వాన్న స్థితికి చేరింది. తూర్పుగంగవరం - తాళ్లూరు రోడ్ లో లింగాల పాడు వద్ద నుండి ఈ దారి తాళ్లూరు - ముండ్లమూరు ఆర్ అండ్ బి డబుల్ రోడ్ కు దగ్గరి మార్గం కావటంతో అద్దంకి, వినుకొండ ఇతర ప్రాంతాలకు కంకర, డస్ట్ అధిక టన్ను వెయిటేజ్ లో లారీలు అధిక మొత్తంలో తిరగటంతో చక్కగా ఉన్న రోడ్డు కాస్తా మోకాలు లోతు గుంతలు తేలాయి. ప్రస్తుతం ఆ దారిలో తూర్పుగంగవరం, రమణాల వారి పాలెం, తురక పాలెం, లింగాల పాడు, దారం వారి పాలెం గ్రామ ప్రజలు సైతం ద్విచక్ర , వాహన దారులు ప్రయాణాలు సాగించాలంటే భయాందోళన చెందుతున్నారు. కొద్ది పాటి వర్షం కురిసినా గోతులతో నీరు నిల్వ ఉండటంతో ఏ గుంత ఎంత పెద్దతో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు.

నిత్యం ఆ దారిని ఉపయోగించే రైతులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కొక్క గుంతలో ఒక్కొక్క లారీ కంకర పడే అంత పెద్ద గా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లను అద్దంలా చేసామని గత ప్రభుత్వంలో మంజూరు అయిన పనుల గురించి తెలిపకుండా కనీసం ఈ ప్రభుత్వం గుంతలను అయినా పూడిపించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు వదిలే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంటున్నారు.

నిత్యం రద్దీ బ్రిడ్జిపై గుంతలతో ప్రమాదాలు ...

తాళ్లూరు - కొత్త పాలెం మధ్య చెరువు అలుగు వొంక బ్రిడ్జి వద్ద బ్రిడ్జి పై పశువుల కొష్టాల నుండి వస్తున్న వ్యర్థపు నీరు ప్రవహిస్తూ బ్రిడ్జి స్లాబు, రోడ్డుకు మధ్య పెద్ద గోతులు ఏర్పాడ్డాయి. దీంతో చిన్న కార్లు వేసుకుని దూర ప్రాంతాల నుండి వస్తున్న వారికి రోడ్డు అర్థం కాక డోము నెలకు గుద్దుకొని ప్రమాదాలకు గురవు తున్నారు. ఇక ద్విచక్రవాహన దారులు గుంతలు తప్పించుకునేందుకు అటూ ఇటూ తిప్పుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నీరు సైతం చింది మీద పడినప్పుడు భరించ లేని దుర్వాసన వస్తుంది. అనేక నెలలుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సైతం విన్నవిస్తున్నా సమస్యలను పరిష్కరించిన నాధుడే లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లా అధికారులు సైతం నిత్యం ఈ దారిలో దర్శి వైపు దగ్గర మార్గం అని ప్రయాణాలు సాగిస్తున్నా సరే సమస్య పరిష్కారం కాక పోవటం దారుణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. లింగాల పాడు - మన్నేపల్లి మధ్య గూడ పెద్ద పెద్ద గోతులు ఉండగా ఇటీవల ఆ సొసైటీ అధ్యక్షుడు సమర కొంత మేర సరిచేయించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా రోడ్డు లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్కొక్క గోతికి టర్బన్

-జనార్దన్ రెడ్డి, విఠలాపురం

రమణాలవారిపాలెం , విఠలాపురం రోడ్ లో ఒక్కొక్క గుంతకు ఒక పెద్ద లారీ కంకర పడు తుంది. రాత్రి వేళ గోతులు అర్థం కాక ప్రమా దాలకు గురవుతున్నారు. గుంతలను పూడ్చించాలి .

ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా పురస్కారాలు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియం నందు ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్ష, కార్యదర్శులు తొగటి శ్రీను పారెళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన గురుపూజోత్సవం సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందించడం జరిగింది. సేవా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు నల్లూరి వెంకటేశ్వరరావు, మద్దాలి విశ్వ భారతి,జనరాజు పల్లి యాకోబు,అంబటి వీరారెడ్డి, ఉప్పుటూరి బ్రహ్మయ్య,వాకా వెంకటేశ్వర రెడ్డి,మానేపల్లి నాగకుమార శర్మ మరియు జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న చీమకుర్తి నగర పంచాయతీ కమిషనర్ వై. రామకృష్ణయ్యను శాలువాతో సత్కరించి, మెమోంటులను అందించడం జరిగింది. ఈ సమావేశాన్ని మాజీ సెక్రటరీ పి శ్రీనివాసమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి,గొల్లపూడి వెంకటరావు,కడవా రామకృష్ణ, గుండా చిన్న వెంకటేశ్వర్లు, మాజీ కార్యదర్శులు డిస్ట్రిక్ట్ కమిటీ రీజనల్ చైర్మన్ ముప్పూరి చలమయ్య,అంబటి వీరారెడ్డి, సభ్యులు నాగళ్ళ సత్యం పెళ్లి ఆదినారాయణ రెడ్డి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

చీమకుర్తి లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పార్థసారధి

విశాలాంధ్ర-చీమకుర్తి : లైన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులుగా చదవాది పార్థసారథి ఎంపికైనారు. ఆదివారం జియో అండ్ ఎం కన్వెన్షన్ హాల్ నందు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ కార్యక్రమానికి అధ్యక్షత వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా పి రాజశేఖర్ డి ఎం జి ఓ ఒంగోలు, వై. రామకృష్ణయ్య మున్సిపల్ కమిషనర్ చీమకుర్తి, ఆర్. బ్రహ్మయ్య ఎమ్మార్వో చీమకుర్తి, ఎం సుబ్బారావు సిఐ చీమకుర్తి, ఎం సుకన్య ఎక్సైజ్ చీమకుర్తి హాజరయ్యారు. లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చలువాది బదరినారాయణ మాట్లా డుతూ లైన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చీమకుర్తి పరిసరం ప్రాంతాల్లోని ప్రజలకు అందించామని అన్నారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా చదవాది పార్థసారథి లైన్స్ క్లబ్ సెక్రటరీగా డాక్టర్ బి.జవహర్,ట్రెజరర్ గా అంజిరెడ్డి ఎంపికయ్యారు.

కార్మికుల ఐక్యతోనే సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధానాలను తిప్పికొట్టాలంటే కార్మికుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాలం సుబ్బారావు, సుబ్బారావులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పుగుండూరులో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు కన్వీనరు ,కో కన్వీనర్లు గా బసవపున్నయ్య, నలతోటి రామా రావులతో పాటు మరో ఎనిమిది మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా, మండల అధ్యక్షులు జె జయంతిబాబు, టి శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

ఏచూరి స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు నిర్మిద్దాం

విశాలాంధ్ర-కొండపి : మతసామరస్యం కోసం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు అన్నారు. సభకు ముందుగా ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు పిచ్చయ్య పూలమాలలు వేసి నివా ళులర్పించారు. వందనం, అంకయ్యలు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా క్లయింట్ అన్నంరెడ్డి అవంతి రెడ్డి W/o మధుసూదన్ రెడ్డి హైదరాబాద్ వారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తికి వారసురాలై ఉన్నారు. సదరు ఆస్తులు నా క్లయింట్‌కు హిందు వారసత్వరీత్యా సంక్రమించి నద్దై ఉన్నది. ఇట్లుండగా నా క్లయింట్ గైర్హాజరును అవకాశముగా తీసుకొని ఈ క్రింది షెడ్యూల్ ఆస్తులను ఇతరులకు విక్రయించుట మరియు రెవెన్యూ రికార్డులను తారుమారు చేయుటకు ప్రయత్నించుచున్నట్లు తెలియవచ్చినవి.

కావున నా క్లయింట్‌కు తెలియకుండా క్రింది షెడ్యూల్ ఆస్తులకు సంబంధించి ఏ విధమైన లావాదేవీలు, క్రయ విక్రయాలు ఏమియు చేయరాదని మరియు అతిక్రమించి జరిపిన లావాదేవీలు ఏవియు నా క్లయింట్‌కు బద్ధకించ జాలవని మరియు చట్టరీత్యా చెల్లుబాటు కావని తెలియజేయడమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా, సింగరాయకొండ, S.R.O సింగరాయకొండ మండలం, బింగినపల్లి విలేజ్. S.No. 625,Ac 5.04 Cents, S.No. 626-Ac 5.28 Cents, S.No.527/A-Ac16.72 Cents,S.No. 627/E-Ac.14.50Cents, S.No. 628,Ac8.86Cents, S.No. 629, Ac3.72 Cents, -Totel Extent Ac. 54.12Cents.

పి. శ్రీనివాసరావు
అడ్వకేట్, నెల్లూరు

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

విశాలాంధ్ర - గిద్దలూరు : సమాజంలో కీలకపాత్ర ఉపాధ్యాయులు దేనిని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఆదివారం విట్ట సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు ఇటీవలే మెగాడీఎస్ ని పూర్తి చేశామని ఉపాధ్యాయులు 75శాతం తమ ప్రభుత్వం ద్వారా వచ్చిన వాళ్లే అన్నారు. పాఠశాలలో సన్నబియ్యంతో భోజనం మౌలిక సదుపాయాల కల్పన పిల్లలకు కావలసిన అన్ని ఉచితంగా అందజేస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఎమ్మెల్యే అశోక రెడ్డిని, యువ నాయకుడు కృష్ణ కిషోర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, మున్సిపల్ కమీషనర్ రమణ బాబు, మండల విద్యాశాఖాధికారులు నాగభూషణ్ రెడ్డి, అశ్వనీకుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు రాఘవ రెడ్డి పిడతల రమేష్ రెడ్డి, మొర్రి పిచ్చయ్య, టి.కె.యస్ ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షేక్ ఫిరోజ్‌కు బీసీ సంఘాలు అభినందనలు

విశాలాంధ్ర - కనిగిరి : పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్ ఎన్నిక కావడాన్ని పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో పార్టీ అధ్యక్ష పదవికి ఎంపికైన ఫిరోజ్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈర్ల విజయరామరాజు, దేవరాజు గట్టు శివ కాశయ్య, బొప్పరాజు సుబ్బరావు, దోసపాటి బ్రహ్మగౌడ్, నల్లబోతుల దొరసాని, షేక్ ఫాతిమా, గుజ్జుల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జల్సా సీరతల్ నబీ

విశాలాంధ్ర -కంభం : సర్వమానవులకు సృష్టికర్త ఒక్కడే అని తెలియ చేయటకు మహమ్మద్ ప్రవక్త(సఆసో) పుట్టారని ఆయన జీవితం అందరికి మార్గ దర్శకమనీ వక్త లు ఇల్యాస్ ఉల్ ఖాద్రి మిస్బాహి సాహెబ్ అన్నారు .మీలాద్ నబీ పురస్కరించుకొని ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద మజీద్ ఏ హుస్సేన్ ప్రాంగణం లో జల్సా ఏ సీరతుల్ నబీ ఏర్పాటు చేశారు. ఈ జల్సాలో కర్ణాటకు చెందిన ఖాజీ మొహమ్మద్ ఇలియాజ్ ఖాద్రి ముఖ్య అతిథిగా పాల్గొనీ మహమ్మద్ ప్రవక్త రసూలుల్లాహ్ సొల్లల్లాహువలైహువసల్లం జీవితము, ముహమ్మద్ రాకతో హలీమా కుటుంబంతో అనేక అద్భుత సంఘటనలు సంభవించినట్లు నివేదించబడిందని తెలిపారు .మొహమ్మద్ ప్రవక్త సాటిమనిషిని ప్రేమించాలని ,పేదవారిని సహాయం చేసి ఆదుకోవాలని తన ప్రవచనలో పేరొన్నారని తెలిపారు.సృష్టిని కాదని సృష్టికర్తని ఆరాధించాలని మొహమ్మద్ ప్రవక్త నిత్యం శ్రమించారని ఖాద్రి మిస్బాహి సాహెబ్ అన్నారు. సమావేశంలో ముస్లింసోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అన్నదాత పోరుబాటు జయప్రదం చేయాలి

-వెన్నపూస వెంకటరెడ్డి

విశాలాంధ్ర-దర్శి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శాసనసభ్యులు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత కార్యక్రమం జయప్రదం చేయాలని దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతుల ఎదుర్కొన్న సమస్యలపై వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో రైతులకు అండగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఏరియా కొరత విత్తనాల కొరత, రైతు సమస్యలపై కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో చేపట్టి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చైర్మన్ కె.వి.రెడ్డి షకీలా అమిన్ భాష, తొమ్మిది అంజిరెడ్డి కాగల కృష్ణారెడ్డి కురిచేడు దొనకొండ ముండ్లమూరు తాళ్లూరు మండల కన్వీనర్లు హాలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ దర్శి మండల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-దర్శి : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ దర్శి మండల మహాసభ ఆదివారం సుందరయ్య భవన్లో ఆర్ జెస్సీ పాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ డివైఎఫ్ఐ నాయకులు సందు వెంకటేశ్వరరావు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య లు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం విచ్చలవిడిగా పెరిగిపోతావుందని ప్రభుత్వాలు నిరుద్యోగ నే పట్టించుకోవడంలేదని రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి రాష్ట్ర కేంద్ర శాఖలలో ఖాళీగా ఉన్న ఎనిమిది లక్షల ఉద్యోగాలనీ భర్తీ చేయాలని.ప్రభుత్వ రంగ సంస్థలనీ కాపాడాలని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఇంటికో ఉద్యోగం నల్లధనాన్ని వెలికి తీయాలని. నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి కల్పించాలని. దొనకొండ నీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసి నిరుద్యోగులకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం డివైఎఫ్ఐ దర్శి మండల కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా షేక్ పీరాసాహెబ్. కార్యదర్శిగా ఆర్ జె సి పాల్. ఉపాధ్యక్షులుగా బిజ్జం శ్రీనివాసులు రెడ్డి.కే కళ్యాణ్. పి లోకేష్. సహాయ కార్యదర్శులుగా కంట వెంకట్రావు.బి రామాంజి నాయక్. టి రాకేష్ రోషన్.డి గోపి. కమిటీ సభ్యులుగా ఎల్ శ్రీనివాసులు రెడ్డి. షేక్ సుభాని. లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈ నూతన కమిటీ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఖాళీ పోస్టులు భర్తీ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటలు చేస్తామన్నారు.

ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీ పల్లి మండల కేంద్రంలో ఆదివారం ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ ఎన్ రాఘవరావు ఏవో కే శివ నాగ ప్రసాద్ శ్రీ వీర వెంకట రమణ ఫెర్టిలైజర్ వెంకట కామాక్షి ట్రేడర్స్ ఎరువుల దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. రైతులకు యూరియా సమస్య ఎదురవుతున్న విషయంపై అధికారులు ఆరా తీశారు. గోడౌన్లలో యూరియా లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలని డీలర్లను హెచ్చరించారు శ్రీ వీర వెంకటరమణ ఫెర్టిలైజర్ దుకాణంలో రూ 271320 విలువగల 10.2 టన్నుల డిఏపి ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయాల్సిందిగా డీలర్ కి చూసించారు ఎమ్మార్పీ రేట్ల కంటే ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారితో పాటు మండల వ్యవసాయ అధికారి ఎన్ రంగా కృష్ణ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా దొడ్డ పావని

విశాలాంధ్ర-పెద్దారవీడు : ఒంగోలులోని కలెక్టర్ హాలులో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో పలు ప్రభుత్వ ఉపాధ్యాయులకు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఈవో ఎ. కిరణ్ కుమార్ జిల్లా ఎస్పీ దామోదర్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీతలందరూ పాల్గొన్నారు. పెద్దారవీడు మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల "డీఈఈపీ ,పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకి, సొంతం నిధులు ఖర్చుపెట్టి పలు కార్యక్రమాలు చేశారు. ఉపాధ్యాయరాలు పావనికి ఈ అవార్డు రావడం పట్ల ఎంఈఓ 1 పి. శ్రీనివాసులు,ఎంఈఓ 2 సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు వారితో పాటు ఉపాధ్యాయులు , గ్రామస్తులు పావని అభినందించారు. జిల్లా స్థాయిలో ఎంపిక ఆవడం పై పాఠశాల హెడ్మాస్టర్ జోష్ణ, ఉపాధ్యాయులు పద్మావతి, సీతమ్మ, బీబీ, రాజు, శంకర్ పావని నీ తదితరులు అభినందించారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని వారు కొనియాడారు.

వాసవి వారోత్సవాలు

విశాలాంధ్ర - గిద్దలూరు : వాసవి వారోత్సవాలు భాగంగా గిద్దలూరు వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ గర్రె సాహితి ఆధ్వర్యంలో గిద్దలూరులోని మానసిక వికలాంగుల స్కూల్ విద్యార్థులకు పండ్లు బిస్కేట్లు బ్రేడ్లు పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోర్డినేటర్ గర్రె సత్యనారాయణ రీజియన్ చైర్మన్ ధనుంజయ్ డిస్టిక్ ఇన్‌చార్జి ముప్పురి రాజేశ్వరి గుప్త రీజియన్ సెక్రటరీ ఆరవీటి చంద్ర శేఖర్ జోన్ చైర్మన్ భవనాశి రామాజనేయులు మాగులూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ నరసయ్య బదిలీ

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు ట్రాన్స్కో ఏఈగా పనిచేస్తున్న నరసయ్య బదిలీ అయ్యారు. గిద్దలూరులో నూతన ఏఈగా 2019 నుండి బాధ్యతలు తీసుకొని 6 సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం గిద్దలూరు నుండి విజయవాడ సిఈ జోనల్ ఆఫీస్‌కు బదిలీపై వెళున్నారు. ఈయన సేవలను గుర్తు చేసుకుని ఘనంగా సన్మానం చేశారు. డిఈ కమురుద్దీన్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా సామరస్యంగా డ్యూటీ చేసిన నరసయ్య పై స్థాయిలో మరింత పదోన్నతులు లభించాలని ఆకాంక్షించారు. సహకరించిన సహచరులకు ట్రాన్స్‌కో సిబ్బందికి బదిలీపై వెళ్తున్న ఏఈ నరసయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఈ సురేష్ మరియు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించాలి

వ్యవసాయ అధికారి సంపత్‌కుమార్

విశాలాంధ్ర-కురిచేడు : రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ జీవన ఎరువులు మరియు నానో ఎరువుల వాడకం పెంచాలని మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆవుల మంద గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బి. సంపత్ కుమార్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించడం వలన నేలలో సేంద్రియ కర్బన శాతం పెంచుతూ, ఖర్చును తగ్గిస్తూ నాణ్యమైన అధిక దిగుబడిని సాధించ డంతోపాటు నేల యొక్క ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చునని తెలిపారు. రైతులు అధిక మోతాదులో యూరియా వాడడం వలన పైరు పచ్చదనం పెరిగి పురుగులు, తెగుళ్ళు ఎక్కువ ఆశించి, ఖర్చు పెరగడంతో పాటు దిగుబడి తగ్గుతుందని తెలిపారు. వరి వేసే రైతులందరూ శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం వరి నాట్లు వేసేటప్పుడు మొదటి విడతగా 35 కేజీల యూరియా, వరి నాటిన తర్వాత 30 రోజులకు రెండో విడతగా 35 కేజీల యూరియా, నాట్లు వేసిన 60 రోజులకు మూడో విడతగా మరొక 35 కేజీల యూరియా మాత్రమే వాడవలెనని తెలిపారు, రెండు, మూడు విడతలలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడడం వలన అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఒక బస్తా యూరియా- 500 ఎంఎల్ నానో యూరియాతో సమానమని తెలిపారు. నానో యూరియా వాడడం వలన తక్కువ మోతాదులో అధిక పోషకాలు మొక్కకు నేరుగా అందడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చునని తెలిపారు. రైతులు సేంద్రియ మరియు జీవన ఎరువులను వాడడం వలన పంటలలో విషపూరిత అవశేషాలు లేకుండా నాణ్యమైన పంటను అందించడంతోపాటు నేల, నీరు మరియు వాతావరణం కాలుష్యం కాకుండా కాపాడవచ్చునని తెలిపారు. రైతులందరూ నా భూమి ఆరోగ్యమే -నా బలం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాను, పురుగు మందుల అవశేషాలను తగ్గించే ప్రతి చర్యకు నేను భాగ్యస్వామిని అవుతాను అనే లక్ష్యాలు రైతుల్లో చర్చ జరగాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎన్. స్పందన, రైతులు పాల్గొన్నారు.

వినూత్నంగా వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక కొట్టబజారు వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన థింసా, కేరళ నృత్య ప్రదర్శనలు, చిన్నారుల కర్రసాము ఆహుతులను అలరించాయి. వినాయకుని నిమజ్జనాన్ని భక్త జన సందోహం మధ్య కృత్రిమ సరస్సు నిర్మించి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆద్యంతం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ నాని యూత్ ఆధ్వర్యంలో బంపర్ లక్కీ డ్రా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా విజేతలకు రెండు యమహా బైక్‌లు, మూడు ఎలక్ట్రికల్స్ స్కూటర్లు, మూడు స్మార్ట్ మొబైల్స్, రిఫ్రిజిరేటర్, టీవీ, స్మార్ట్ వాచ్, ప్లస్ 50 బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, మహిళలు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు మూసివేత

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చంద్ర గ్రహణం ఏర్పడుతున్న సందర్భంగా చీరాల, మండలంలో ఉన్న దేవాలయాలను మూసివేశారు. ఉదయం అర్చకులు స్వామివార్ల పూజల అనంతరం నైవేద్యాలు సమర్పించి దేవాలయాలను మూసివేశారు. గ్రహణం పూర్తి అయిన తరువాత సోమవారం ఉదయం సంప్రోక్షణ జరిపి భక్తులకు దేవేరుల దర్శనం కల్పించనున్నారు. ఆదిత్య పరాశర జ్యోతిషాలయం పురోహితులు మంత్రిప్రగడ ఆంజనేయ శర్మ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ధనిష్ఠ, శతభిష, పూర్వాభాద్ర నక్షత్రంకు చెందినవారు దోష నివారణకు శాంతి పూజలు చేయించుకుని, దానాలు ఇవ్వాలని పరిహారాన్ని సూచించారు.

రూ.1.40లక్షలు పలికిన గణపతి లడ్డూ

విశాలాంధ్ర - సంతమాగులూరు : గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. వినాయక నిమజ్జనం సందర్భంగా ఏల్చూరు తోట ఆంజనేయ స్వామి వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి చేతిలోని లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించారు. వంగవీటి రంగా బొమ్మ సెంటర్‌కు చెందిన నారదాసు వెంకయ్య కుమారుడు నారదాసు శ్రీనివాసరావు రూ.1.40 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం ఉత్సవ కమిటీ, కాపు యువత ఆధ్వర్యంలో ఊరేగింపుగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈఏడాది సంతమాగులూరు మండలంలోనే అత్యధిక ధర పలకడం విశేషం.

రామకృష్ణ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి, విద్యార్థుల భవితకు తోడ్పాటు అందించిన రామకృష్ణారావు సేవలు అభినందనీయమని ఎంతవోలు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ ప్రశంసించారు. ఆదివారం రాత్రి ఏల్చూరు వడ్డెర కాలనీలో ఉన్న ఎంపీపీఎస్ (వి.సి) స్కూలులో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు దేవవరపు రామకృష్ణారావుకు వీడ్కోలు సభను కాలనీవాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం రామకృష్ణారావు, అనంతలక్ష్మి దంపతులను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం పల్లెపోగు విజయలక్ష్మి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, టీచర్లు పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు అన్యాయం జరిగితే సహించం

మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రెడ్ శాండిల్ మొక్కల వ్యాపారస్తుల చేతిలో మోసపోయిన మాజీ సైనికులకు బాసటగా మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు నిలిచారు. రాయలసీమకు చెందిన వివిధ జిల్లాల మాజీ సైనికులు విజయవాడకు చెందిన రెడ్ శాండిల్ వ్యాపారస్తుల చేతిలో పొలాలు కొని మోసపోగా, బాధిత మాజీ సైనికులకు మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు బాసటగా నిలిచి విజయవాడలోని బెంజ్ సర్కిల్ సెంటర్లో గల వ్యాపారస్తుల కార్యాలయంలో చర్చలు జరిపి మోసగించిన వ్యాపారస్తులతో మాట్లాడి తగిన విధంగా న్యాయం చేయాలని కోరారు. మాజీ సైనికులకు పట్ల అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోకపోతే చట్ట పరమైన చర్యల కోసం పోలీసు ఉన్నతాధికారులను, రెవెన్యూ అధికారులను ఇంకా సంబంధిత అన్ని శాఖల అధికారులను కలిసి విషయాన్ని తెలియజేసి, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించడంతో, వ్యాపారస్తులు త్వరితగతిన పరిష్కరిస్తామని మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కోశాధికారి కె.ఉమామహేశ్వరరావు, బాపట్ల అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పీటా సారధి, సీనియర్ మాజీ సైనికులు తాడివాక రుక్మధరరావు, బాధిత మాజీ సైనికులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్యస్పందన

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె తీర ప్రాంత వాసులకు అను మై బేబీ హాస్పటల్ యాజమాన్యం వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం అను మై బేబీ హాస్పిటల్ విజయవాడ, ఐఎంఏ రేపల్లె, ఏఎస్‌పి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అనగాని శివప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంత వీర రాఘవయ్య, టిడిపి రేపల్లె పట్టణ, మండల అధ్యక్షులు మేక రామకృష్ణ, రేపల్లె రామాంజనేయులు, తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, రెడ్ క్రాస్ కార్యదర్శి కరిముల్లా, డాక్టర్ రాజేంద్రప్రసాద్, అను మై బేబీ హాస్పటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్ష

విశాలాంధ్ర-ఒంగోలు : అటవీ శాఖలోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఆదివారం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు తెలిపారు. ఈ పరీక్షలు జరిగిన ఒంగోలు నగరము, దాని శివారు ప్రాంతాల్లోని 10 కాలేజీలను ఆయన సందర్శించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసిన 7052 మందిలో 5642 మంది హాజరయ్యారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసిన 1153 మందిలో 901 మంది పరీక్ష రాశారు. ఆఫ్ లైన్ పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ ఈ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న సమయంలో డీఆర్వోతో పాటు ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పి. మధుసూదనరావు, అధికారులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా : తహసీల్దార్

విశాలాంధ్ర జె.పంగులూరు : మండలంలో రైతులకు కావలసినంత యూరియా అందు బాటులో ఉన్నదని మండల తహసీల్దార్ సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వరి సాగు 122 హెక్టార్లు కాగా ఇందుకుగాను ఇప్పటివరకు 40 హెక్టార్లలో వరి నాట్లు వేయడం జరిగినదని, వరి సాగు పూర్తిగా మొదలు కాలేదని తెలుపుతూ పంగులూరు మండలంలో ఆదివారం 94.455 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఈ క్రింద తెలిపిన వారి వద్ద ఉన్నదని తెలిపారు. పృథ్వి ఎఫ్ఈఓ, అలవలపాడు 36.225 మెట్రిక్ టన్నులు, వెంకటరమణ ట్రేడర్స్ 15.165 మెట్రిక్ టన్నులు, సాయి శ్రీనివాస ట్రేడర్స్ 10.17 మెట్రిక్ టన్నులు, మన గ్రామర్ సెంటర్ గ్రోమోర్ సెంటర్ 13.005 మెట్రిక్ టన్నులు, హనుమాన్ ట్రేడర్స్ 1.89 మెట్రిక్ టన్నులు, పంగులూరు ఒకటి రైతు సేవ కేంద్రం 9.0 మెట్రిక్ టన్నులు, చందలూరు రైతు సేవ కేంద్రం 9.0 మెట్రిక్ టన్నులు చొప్పున నిల్వ ఉన్నవి రైతులకు అవసరమైనటువంటి యూరియా అందుబాటులో ఉందన్నారు.

రమేష్, వెంకటాద్రిలకు సన్మానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల టిడిపి అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బొబ్బూరి రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షులుగా ఎన్నికైన బత్తుల వెంకటాద్రి కూటమి నాయకులు ఆదివారం శాలువాతో సత్కరించారు. సందర్భంగా వారికి అయోధ్య బలరాముని చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్‌పురం నీటి సంఘం మాజీ తోట వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు మన్నేపల్లి సురేష్ బోయిన రాయుడు బోయిన మహేంద్ర బందారు వెంకట రాముడు కూటగుళ్ల మహబూబ్ బాషా అధ్యక్షులు కూటమి నాయకులు మాదినేని లక్ష్మణ్, గుంత చెన్నంపల్లి మాజీ సర్పంచ్ కొత్త తిరుపతయ్య, టి లక్ష్మీనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషాలు ఉన్నారు.